మంగళవారం చలో ఢిల్లీకి బయలుదేరిన రైతులను పంజాబ్-హర్యానా వద్ద ఉన్న శంబూ సరిహద్దులో అడ్డుకున్న పోలీసులు. ఈ సందర్భంగా భారీ తోపులాట జరుగడంతో పోలీసులు టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు.

రాజధానిపై రైతు దండుయాత్ర

చలో ఢిల్లీ తీవ్ర ఉద్రిక్తం

పంజాబ్-హర్యానా సరిహద్దుల్లో బారికేడ్లు బద్ధలు కొట్టేందుకు యత్నం

టియర్‌గ్యాస్ ప్రయోగించిన పోలీసులు ● ఢిల్లీ సరిహద్దుల్లో భద్రత కట్టుదిట్టం

సింఘు, టిక్రి సరిహద్దులు మూసివేత ● భారీగా నిలిచిన వాహనాలు..

ఢిల్లీలోకి ప్రవేశించేందుకు నేడు మళ్లీ ప్రయత్నిస్తామన్న అన్నదాతలు

రైతు ఉద్యమం 2.0

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: నూతన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా అలుపెరుగని పోరు సాగించి కేంద్ర ప్రభుత్వ మెడలు వంచిన అన్నదాతలు.. ఇప్పుడు మళ్లీ అదే తరహా ఉద్యమానికి పూనుకున్నారు. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత, రైతు రుణాల మాఫీ తదితర డిమాండ్లతో అన్నదాతలు మంగళవారం చేపట్టిన చలో ఢిల్లీ మార్చ్ ఉద్రిక్తంగా మారింది. పంజాబ్, హర్యానా నుంచి వేలాది మంది రైతులు ట్రాక్టర్లలో ఢిల్లీ వైపు కదలగా, వారిని అడ్డుకునేందుకు పోలీసులు పెద్ద ఎత్తున బారికేడ్లు ఏర్పాటుచేశారు. బారికేడ్లు బద్ధలు కొట్టి ముందుకు వెళ్లేందుకు రైతులు ప్రయత్నించడంతో పోలీసులు వారిపై బాష్పవాయు గోళాలను, జల ఫిరంగులను ప్రయోగించారు. లాఠీ చార్జి చేశారు. దీంతో 65మందికి పైగా గాయపడ్డారు. మరోవైపు ఢిల్లీ సరిహద్దుల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. బహుళ అంచెల్లో బారికేడ్లు ఏర్పాటుచేశారు. భారీగా బలగాలను మోహరించారు. సింఘు, టిక్రి సరిహద్దులను మూసివేశారు. దీంతో ఢిల్లీ సరిహద్దుల్లో భారీ ట్రాఫిక్ జామ్ అయింది.

పంజాబ్-హర్యానా సరిహద్దుల్లో ఉద్రిక్తత

పంజాబ్‌లోని ఫతేగఢ్ సాహిబ్ నుంచి మంగళవారం ఉదయం 10 గంటలకు పెద్ద ఎత్తున రైతులు ట్రాక్టర్లలో ఢిల్లీ వైపు కదిలారు. వీరిని అడ్డుకునేందుకు హర్యానా పోలీసులు సరిహద్దుల్లో భారీగా బారికేడ్లు ఏర్పాటుచేశారు. శంభు సరిహద్దు వద్ద రైతులు మెటల్ బారికేడ్లను తొలగించేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వారిపై డ్రోన్లతో టియర్‌గ్యాస్‌ను ప్రయోగించారు. పోలీసులపై రాళ్లు రువ్వడంతో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు భాష్పవాయువును ప్రయోగించామని పోలీసుల తెలిపారు. జింద్ సరిహద్దులోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది. రైతులపైకి పోలీసులు టియర్‌గ్యాస్, జలఫిరంగులను ప్రయోగించారు.

ఢిల్లీ సరిహద్దుల్లో భారీ ట్రాఫిక్ జామ్

దేశ రాజధానిలోకి రైతులు ప్రవేశించకుండా ఢిల్లీ సరిహద్దుల్లో పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. కాంక్రీట్ బ్లాక్‌లు, బారికేడ్లు, ఇనుప కంచెలు, కంటైనర్ల గోడలతో దారులు మూసేసింది. వందల సంఖ్యలో పోలీసు బలగాలను మోహరింప చేసింది. సింఘు, టిక్రి సరిహద్దులను మూసేసింది. దీంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. రైతుల మార్చ్ నేపథ్యంలో ఢిల్లీలోని 9 మెట్రో రైల్వే స్టేషన్లలో గేట్లను మూసేశారు. ప్రయాణికులను ఇతర గేట్ల గుండా స్టేషన్లలోకి అనుమతించారు. భద్రతా కారణాల దృష్ట్యా ఎర్రకోటను తాత్కాలికంగా మూసివేశారు.

హడావుడిగా చట్టం తేలేం: కేంద్రం

రైతులు చేపట్టిన ఆందోళనపై కేంద్ర మంత్రి అర్జున్ ముండా స్పందించారు. కనీస మద్దతు ధరపై తక్షణమే చట్టం చేయటం కుదరదని కుండబద్ధలు కొట్టారు. దీనిపై రైతు సంఘాలు చర్చకు రావాలని పిలుపునిచ్చారు. రైతులను కొన్ని శక్తులు రెచ్చగొడుతున్నాయని విపక్షాల నుద్దేశించి ఆరోపణ చేశారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుకున్నదే తడవు చట్టం చేయటానికి వీలుపడదని, దీనిపై అన్ని వర్గాలతో సుదీర్ఘంగా చర్చించాల్సి ఉన్నదని స్పష్టం చేశారు. అందుకోసమే రైతు సంఘాలు ఆందోళన ఆపి ప్రభుత్వంతో చర్చలు జరపాలని కోరారు. ఈ ఆందోళనలపై ఇప్పటికే కేంద్రమంత్రులు పీయూష్ గోయల్, అర్జున్ ముండా నేతృత్వంలోని ప్రభుత్వ బృందం రైతు ప్రతినిధులైన ఎస్‌కేఎం నేత జగ్జీత్ సింగ్ డల్లేవాల్, కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ ప్రధాన కార్యదర్శి సర్వన్‌సింగ్ పంధేర్ తదితరులతో సోమవారం చర్చించింది. రైతులు చేసిన డిమాండ్లలో కొన్నింటిని అంగీకరించింది. కనీస మద్దతు ధరపై మాత్రం ఏకాభిప్రాయానికి రాలేదు.

> రైతుల నిరసనను అణగదొక్కాలని చూస్తే ఊరుకోం. 2020-21 మధ్య తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాల రద్దు కోసం ఎలాంటి ఉద్యమం చేపట్టామో కేంద్ర ప్రభుత్వానికి గుర్తు ఉందని అనుకుంటా. - రాకేశ్ టికాయిత్ (రైతు సంఘం బికేయూ నేత)

చలో ఢిల్లీ కారణంగా ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో 'ఢిల్లీ-గురుగ్రామ్ ఎక్స్‌ప్రెస్‌వేపై భారీగా నిలిచిన వాహనాలు

ఆర్నెల్లకు సరిపడా రేషన్, డీజిల్

సుదీర్ఘ పోరాటానికి అన్నదాత సై

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: మాట తప్పిన మోదీ సర్కారు మెడలు వంచే వరకు ఈసారి వెనుదిరగబోమని, తమ డిమాండ్లు నెరవేరేవరకు దేశ రాజధానిని విడిచేది లేదంటూ వేల మంది రైతులు ఢిల్లీ వైపు పయనమయ్యారు. కనీసం ఆరు నెలలకు సరిపోయేటన్ని ఆహార పదార్థాలు, డీజిల్‌ను వెంట తీసుకెళ్తున్నామని చెప్పారు. రైతులు రాజధాని నగరంలోకి ప్రవేశించకుండా పోలీసులు ఇప్పటికే ఎక్కడికక్కడ అన్ని మార్గాల్లో ముళ్ల కంచెలతో బారికేడ్లు ఏర్పాటుచేశారు. ఇంతకుముందు 2020లో 13 నెలల పాటు ఢిల్లీ సరిహద్దుల్లో మోహరించిన రైతులు నాటి తమ ఆందోళనకు కొనసాగింపుగానే మరోసారి ఉద్యమించినట్టు చెప్తున్నారు. పంటకు కనీస మద్దతు ధరతోపాటు ఇంకా అనేక డిమాండ్ల సాధన కోసం వారు మరోమారు ఆందోళన బాటపట్టారు. తమ సహనానికి ఎంత పరీక్ష పెట్టినా ఈసారి తమ డిమాండ్లు నెరవేరేవరకు ఆందోళన విరమించేది లేదన్నారు.

డీజిల్ కృత్రిమ కొరత

'నూది నుంచి సుత్తి వరకు.. రాళ్లను సైతం బద్దలుకొట్టే అన్ని పనిముట్లు మా ట్రాక్టర్ ట్రాలీల్లో ఉన్నాయి. ఆర్నెల్ల రేషన్‌తో మా గ్రామాల నుంచి బయలుదేరాం. మాకే కాదు మా హర్యానా సోదరులకు సైతం సరిపోయేంత డీజిల్ కూడా మా వద్ద ఉన్నది' అని పంజాబ్‌లోని గుర్దాస్‌పూర్‌కు చెందిన హర్భజన్ సింగ్ అనే రైతు చెప్పారు. తాను 2020లో జరిగిన రైతుల ఆందోళనలో కూడా పాల్గొన్నానని, ఈసారి తమ డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళన విరమించబోమని స్పష్టం చేశారు. తన ట్రాక్టర్‌కు రెండు ట్రాలీలను అనుసంధానం చేసి ఆయన ఢిల్లీ వైపు బయలుదేరారు. పంజాబ్, హర్యానాల్లోని అనేక బంకుల్లో రైతుల ట్రాక్టర్లకు డీజిల్ అందకుండా కృత్రిమ కొరతను సృష్టించినట్టు వార్తలు వచ్చాయి. 'ఇంతకుముందు 13 నెలలు ఏకధాటిగా ఢిల్లీ సరిహద్దులను దిగ్బంధం చేశాం. దీంతో మా డిమాండ్లన్నింటినీ నెరవేరుస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. కానీ ఆ వాగ్దానాన్ని ఇంతవరకు నిలబెట్టుకోలేదు. ఈసారి మాత్రం వాగ్దానాలకు లొంగే ప్రసక్తే లేదు' అని మరో రైతు చెప్పారు.

కోటి ఇళ్లకు ఉచిత విద్యుత్తు

'పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన' ప్రారంభం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: దేశంలో సౌర విద్యుత్తు వినియోగం పెంచడానికి మరో అడుగు పడింది. కరెంట్ బిల్లుల భారం తగ్గింపు, ఆదాయం పెరుగుదల, పలువురికి ఉపాధి లక్ష్యంతో ప్రతి నెలా కోటి ఇండ్లకు నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత కరెంట్‌ను అందించేందుకు ప్రవేశపెట్టిన 'పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన' పథకాన్ని ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం ప్రారంభించారు. సౌర విద్యుత్తు ఉత్పత్తి, సుస్థిర ప్రగతి సాధనకు దీనిని ప్రవేశపెట్టినట్టు చెప్పారు. ఈ ప్రాజెక్టు కింద 75 వేల కోట్ల రూపాయలను పెట్టుబడిగా పెట్టనున్నట్టు ఆయన 'ఎక్స్'లో తెలిపారు. ఈ పథకం పొందడానికి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రూఫ్ టాప్ సోలార్ వ్యవస్థ ఏర్పాటుకు బ్యాంకుల నుంచి భారీగా రుణాలు పొందవచ్చునని చెప్పారు. ఈ పథక వాటాదారులను జాతీయ పోర్టల్‌కు అనుసంధానం చేస్తారన్నారు. ఈ పథకం కింద ఇచ్చే సబ్సిడీలను ప్రజల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా జమవుతాయన్నారు.

కాంగ్రెస్‌కు ఒక సీటు ఇస్తాం

- ఢిల్లీలో ఆరు చోట్ల పోటీ చేస్తాం
- లోక్‌సభ ఎన్నికలపై ఆప్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలో ఆరుస్థానాల్లో పోటీ చేయాలనుకుంటున్నామని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తెలిపింది. ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సందీప్ పాఠక్ విలేకరులతో మాట్లాడుతూ 'ఢిల్లీలో మొత్తం ఏడు లోక్‌సభ నియోజకవర్గాలున్నాయి. వీటిలో ఆరు చోట్ల పోటీ చేయాలన్నది మా ఆలోచన. ఒక సీటును కాంగ్రెస్‌కు ఇస్తాం. ప్రస్తుతం ఢిల్లీలో కాంగ్రెస్‌కు ఒక్క ఎంపీ కూడా లేరు. అసెంబ్లీలోనూ అదే పరిస్థితి. ఇక కొద్ది రోజుల కిందట జరిగిన ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం 250 సీట్లకుగానూ కాంగ్రెస్ గెలిచింది కేవలం 9 సీట్లే. వీటన్నింటినీ క్రోడీకరించి చూస్తే ఢిల్లీలో కాంగ్రెస్ పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతున్నది. కాబట్టి 6 సీట్లలో మేము పోటీ చేసి మిగిలిన ఒక సీటును కాంగ్రెస్‌కు ఇస్తాం' అని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనపై కాంగ్రెస్ మండిపడింది. సీట్ల పంపకాలు తేలాల్సింది విలేకరుల సమావేశంలో కాదని వెల్లడించింది. కాగా పంజాబ్‌లో లోక్‌సభ స్థానాలకు తాము ఒంటరిగానే పోటీ చేస్తామని ఆప్, కాంగ్రెస్ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రతిపక్ష ఇండియా కూటమిలో ఈ రెండు పార్టీలు భాగస్వామిగా ఉన్నాయి.

బీజేపీలో చేరిన మాజీ సీఎం చవాన్

రేపు రాజ్యసభకు నామినేషన్

ముంబై, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన 24 గంటల్లోనే మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్ బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. 65 ఏండ్ల చవాన్‌కు ముంబైలోని బీజేపీ కార్యాలయంలో సాదర స్వాగతం లభించింది. ఉప ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌తో సహా కీలక నేతలు చవాన్‌కు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. తన రాజకీయ జీవితంలో ఇదో కొత్త దశ అని చవాన్ పేర్కొన్నారు. సుమారు నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్‌లో ఉన్న చవాన్ ఇప్పుడు బీజేపీ కండువా కప్పుకున్నారు. అశోక్ చవాన్‌కు రాజ్యసభ సీటు ఇస్తారనే ఊహాగానాల మధ్య ఆయన బీజేపీ గూటికి చేరుకోవటం గమనార్హం. బుధవారం ఆయన రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేయనున్నట్టు వార్తలు వెలువడ్డాయి. బీజేపీ అశోక్ చవాన్‌ను రాజ్యసభకు పంపినట్టయితే అది అమరవీరులైన సైనికులను అవమానించినట్టేనని శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే విమర్శించారు. అయితే తన 38 ఏండ్ల రాజకీయ జీవితంలో కొత్త ప్రయాణాన్ని ప్రారంభించి.. కొన్ని మంచి పనులు చేయాలని, ప్రగతిశీల ఆలోచనలతో ముందుకు వెళ్లాలని అనుకుంటున్నట్టు అశోక్ చవాన్ వెల్లడించారు.

జయప్రదను అరెస్ట్ చేయండి

రాంపూర్ కోర్టు ఆదేశం

రాంపూర్ (యూపీ), ఫిబ్రవరి 13: ప్రముఖ నటి, మాజీ ఎంపీ జయప్రదను అరెస్ట్ చేసి తమ ముందు హాజరుపర్చాలని యూపీలోని రాంపూర్ ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు ఎస్సీని ఆదేశించింది. ఒక కేసులో నాన్‌బెయిల్ వారెంట్ ఉన్నా సోమవారం ఆమె హాజరు కాకపోవడంపై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇంతకుముందు ఆమెపై ఏడుసార్లు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ అయినా న్యాయస్థానానికి గైర్హాజరయ్యారు. దాంతో ఒక బృందాన్ని ఏర్పాటు చేయాలని, ఆమెను అరెస్ట్ చేసి తమ ముందు హాజరుపర్చాలని న్యాయస్థానం ఆదేశించింది. కాగా, నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి దాఖలైన రెండు కేసుల్లో ఇప్పటికే జయప్రద పరారీలో ఉన్నారు. వివాదాలకు జయప్రద కొత్తేమీ కాదు. గతంలో కూడా ఒక కేసులో చెన్నై కోర్టు ఆమెకు ఆరు నెలల జైలు, 5వేల జరిమానా విధించింది.

మణిపూర్‌లో అక్రమ వలసదారులపై ఉక్కుపాదం

- 1961 తర్వాత రాష్ట్రానికి వచ్చి స్థిరపడిన వారిపై పిడుగు
- వారందరినీ గుర్తించి వెనక్కి పంపుతామని సీఎం ప్రకటన
- సాధ్యం కాకపోవచ్చు: నిపుణులు

ఇంఫాల్, ఫిబ్రవరి 13: కుకీ, మైతీ తెగల మధ్య అలర్లతో అతలాకుతలమైన మణిపూర్ ఇప్పుడిప్పుడే కుదుటపడుతున్న వేళ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్ బీరేన్‌సింగ్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. 1961 తర్వాత రాష్ట్రానికి వచ్చి స్థిరపడిన అక్రమ వలసదారులను గుర్తించి, రాష్ట్రం నుంచి పంపేస్తామని ఆయన ప్రకటించారు. పొరుగుదేశం మయన్మార్ మిలటరీ చేతుల్లోకి వెళ్లాక చాలామంది ప్రాణాలు అరచేత పట్టుకుని పక్కనే ఉన్న మణిపూర్‌కు క్యూకడుతున్నారు. ఇరు దేశాల మధ్య ఉన్న స్వేచ్ఛాయుత రాకపోకల విధానం వీరికి అనువుగా మారింది. అయితే, ఇది మణిపూర్‌లో కొత్త తలనొప్పులు కారణమవుతున్నది. ఈ నేపథ్యంలో సోమవారం 'ప్రాజెక్టు బునియాద్' కార్యక్రమంలో సీఎం బీరేన్‌సింగ్ మాట్లాడుతూ 1961 తర్వాత రాష్ట్రంలోకి వచ్చి స్థిరపడిన వారిని గుర్తించి కులం, సామాజికవర్గంతో సంబంధం లేకుండా వెనక్కి పంపించేస్తామని పేర్కొన్నారు. 1961ని బేస్ ఇయర్‌గా తీసుకుని ఆ తర్వాత వచ్చిన వారిని వెనక్కి పంపాలన్న ప్రతిపాదనకు మణిపూర్ క్యాబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే, ఇందులో ఓ చిక్కుంది. స్థానికేతరులను గుర్తించి వెనక్కి పంపేందుకు ప్రభుత్వం సిద్ధపడినా ఆయా దేశాలు వారిని తమ పౌరులుగా గుర్తించాల్సి ఉంటుంది. అవి వారిని తమ పౌరులుగా అంగీకరించకుంటే వెనక్కి పంపడం సాధ్యం కాదని రాజకీయ విశ్లేషకుడు ప్రదీప్ పంజౌబమ్ తెలిపారు. ఫిబ్రవరి 2021లో మయన్మార్‌లోని అంగ్ సాన్ సూకీ ప్రభుత్వాన్ని కూలదోసి అధికారాన్ని మిలటరీ హస్తగతం చేసుకున్నాక రాష్ట్రంలోకి 2,187 మంది వలస వచ్చినట్టు ప్రభుత్వ అధికారి ఒకరు గతేడాది వెల్లడించారు. ఇప్పుడా సంఖ్య మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో ఇండియా-మయన్మార్ మధ్య ఉన్న స్వేచ్ఛాయుత రాకపోకలకు కళ్లెం వేయాలని ఇటీవల కేంద్రం నిర్ణయించింది.

బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నా

మహారాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ కో-ఆర్డినేటర్ భగీరథ్ భాల్కే

ముంబై, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): తాను బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని, పార్టీ వీడుతున్నట్లు వచ్చిన వార్తలన్నీ వదంతులేనని పశ్చిమ మహారాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ కో-ఆర్డినేటర్ భగీరథ్ భాల్కే తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పండర్‌పూర్ నుంచి బీఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేయనున్నట్లు వెల్లడించారు. భగీరథ భాల్కే అసెంబ్లీ రంగంలోకి దిగితే పండర్‌పూర్‌లో చతుర్ముఖ పోరు సాగే అవకాశం ఉంది. దివంగత ఎమ్మెల్యే భరత్ భాల్కే జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగీరథ్ భాల్కే మీడియాతో మాట్లాడారు. 'లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి బీఆర్ఎస్ వైఖరి ఇంకా ఖరారు కాలేదు. పార్టీ ఆదేశాల మేరకు లోక్‌సభ ఎన్నికలు జరుగుతాయి. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలన్న పట్టుదలతో ఉన్నాం. పార్టీ అధినేత కేసీఆర్ త్వరలో మహారాష్ట్ర నేతలతో సమావేశం కానున్నారు. ఆ సమావేశంలో లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ వైఖరి ఏమిటనే దానిపై నిర్ణయం తీసుకోనున్నారు' అని వివరించారు.

డీకే శివకుమార్‌పై లోకాయుక్త కేసు

బెంగళూరు, ఫిబ్రవరి 13: అక్రమాస్తుల కేసులో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్‌పై లోకాయుక్త పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ప్రస్తుతం ఈ కేసు సీబీఐ దర్యాప్తు చేస్తుండటంతో హైకోర్టు ఉత్తర్వుల కోసం ఎదురు చూస్తున్నారు. కోర్టు సూచనల మేరకు ఈ కేసులో తాము ముందుకు వెళతామని లోకాయుక్త స్పష్టం చేసింది. ఆదాయానికి మించి ఆస్తుల కేసులో డీకే శివకుమార్‌పై సీబీఐ విచారణకు అనుమతి ఇస్తూ గత బీజేపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత నవంబర్‌లో ఉపసంహరించుకుంది. ఆ కేసు చట్టప్రకారం పెట్టలేదంటూ తన చర్యను సమర్థించుకుంది. అయితే దర్యాప్తు ఉపసంహరణపై హైకోర్టును సీబీఐ ఆశ్రయించడంతో.. కోర్టు ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నట్టు లోకాయుక్త ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

రాజస్థాన్ నుంచి రాజ్యసభకు సోనియా!

న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ రాజస్థాన్ నుంచి రాజ్యసభకు పోటీ చేయనున్నట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి. బుధవారం ఆమె నామినేషన్ వేయనున్నట్టు తెలిపాయి. రెండు నెలల్లో లోక్‌సభకు ఎన్నికలు రానున్న నేపథ్యంలో సోనియా జైపూర్‌లో తన నామినేషన్ పత్రాలను దాఖలు చేయనున్నారు. రాయ్‌బరేలి నుంచి ఎంపీగా ఐదు పర్యాయాలు ప్రాతినిధ్యం వహించిన సోనియా గాంధీ తొలిసారి రాజ్యసభ పోటీలో నిలుస్తున్నారు. కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించాక 1999లో తొలిసారి సోనియా ఎంపీగా ఎన్నికయ్యారు. రాజస్థాన్‌లో ఎన్నికలు జరుగనున్న మూడు రాజ్యసభ స్థానాల్లో ఒకదానిని కాంగ్రెస్ సునాయసంగా కైవసం చేసుకోగలదు.

ఐఐఎం విద్యార్థికి రూ.కోటి ప్యాకేజీ

ఇండోర్: ఇండోర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో విద్యనభ్యసిస్తున్న ఓ విద్యార్థి రూ.కోటి వార్షిక వేతనంతో జాబ్ కొట్టాడు. ఈ-కామర్స్ సంస్థలు ఇటీవల నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో ఐఐఎం స్టూడెంట్‌కు ఈ భారీ ప్యాకేజీతో ఆఫర్ వచ్చింది. ఈ ఏడాది చివరి సెషన్‌లో ఇదే అత్యధిక ప్యాకేజీ ఆఫర్‌గా నిలిచింది. ఈ క్యాంపస్ ఎంపికలో 594 మంది స్టూడెంట్స్‌ను మొత్తం 150 కంపెనీలు ఎంపిక చేసుకున్నాయి. ఓవరాల్‌గా ఈ ఏడాది పలు కంపెనీలకు ఎంపికైన విద్యార్థుల సగటు వార్షిక వేతనం 25.68 లక్షలు. అత్యధికంగా రూ.కోటి వార్షిక వేతనం ఒక విద్యార్థికి రావటం గమనార్హం. సేల్స్ అండ్ మార్కెటింగ్ విభాగంలో అతనికి ఆఫర్ వచ్చింది.

ఆర్నెల్లలో రెండుసార్లు ప్రసవం!

అమెరికాలో అరుదైన సంఘటన

కాలిఫోర్నియా: మాతృత్వం అనేది ఓ మధురానుభూతి. ప్రతి స్త్రీ తల్లి కావాలని కలలు కంటుంది. కానీ కొంత మంది దురదృష్టవంతులకు ఎన్నేండ్లయినా పిల్లలు కలుగరు. వారి సంగతి పక్కన పెడితే.. ఇప్పుడొక విచిత్ర విషయం గురించి తెలుసుకుందాం.. ఒకే మహిళ ఆర్నెల్ల తేడాతో ఇద్దరికి జన్మనిచ్చింది. వైద్యశాస్త్రంలో అత్యంత అరుదైన ఈ సంగతి ఎలా సాధ్యమైందో వైద్యులు వివరించారు. అమెరికాలోని కాలిఫోర్నియాకు చెందిన హెయిర్‌స్టయిలిస్ట్ జెస్సీకా ఆరు నెలల్లో రెండు సార్లు ప్రసవించింది. ఆమె ఇద్దరి సంతానంలో మొదటి సంతానం వయసు ఒక ఏడాది కాగా.. రెండో సంతానం వయసు ఆరు నెలలు. వినటానికి విచిత్రంగా ఉన్నా ఇది నిజం. దీనికి కారణమేంటో కూడా జెస్సికా వెల్లడించింది. దీన్ని వైద్య పరిభాషలో సూపర్ ఫెటేషన్ అంటారని తెలిపింది. ఒకసారి గర్భం దాల్చిన మహిళ మళ్లీ గర్భవతి కావచ్చని పేర్కొన్నది. జెస్సికా విషయంలో ఇద్దరూ ఒకే గర్భాశయంలో వేర్వేరు సమయాల్లో జన్మించారు. అంటే ఒకే గర్భంలో రెండు పిండాలు ఉండి, ఆ రెండూ వేర్వేరు స్థాయిలో అభివృద్ధి చెంది ఉండొచ్చు. సూపర్ ఫెటల్ పిల్లలు టెక్నికల్‌గా ట్విన్స్ అనే చెప్పాలి. కానీ వారు పుట్టిన సమయాల్లో నెలల వ్యత్యాసం ఉంటుంది. ఇలా జరగటం చాలా అరుదు. ఇప్పటి వరకు అలాంటి కేసులు ఓ పది మాత్రమే రికార్డయ్యాయి. జెస్సికా కేసు 11వది. సాధారణంగా ఇలాంటి పిల్లల మధ్య వ్యత్యాసం కేవలం కొన్ని వారాలు మాత్రమే ఉంటుంది. కానీ జెస్సికా విషయంలో ఈ తేడా ఆరు నెలలు.

బిల్కిస్ తీర్పుపై సుప్రీంకు గుజరాత్ సర్కారు

న్యూఢిల్లీ: బిల్కిస్ బానో రేపిస్టులను శిక్షకాలం పూర్తికాకుండానే గుజరాత్ సర్కారు విడుదల చేయడాన్ని కొట్టివేస్తూ ఇటీవల సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును సమీక్షించాలని గుజరాత్ ప్రభుత్వం మంగళవారం సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా న్యాయస్థానం చేసిన తీవ్ర వ్యాఖ్యలపై ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని కోరింది. దోషుల విడుదలలో గుజరాత్ సర్కారు అధికార దుర్వినియోగానికి పాల్పడిందని కోర్టు వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. దోషులు తిరిగి లొంగిపోవాలని ఆదేశించింది. దీంతో 11 మంది దోషులు ఇటీవల లొంగిపోయారు.

పరీక్షలపై వదంతులు వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: తప్పుడు వార్తలు, వదంతులు వ్యాప్తి చేసే వారిని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) తీవ్రంగా హెచ్చరించింది. త్వరలో 10, 12 తరగతుల బోర్డు పరీక్షలు జరగనున్నాయని, పేపర్ లీక్‌లు, తప్పుడు లింక్‌లు, మాదిరి ప్రశ్నపత్రాలు పేరుతో తప్పుడు వార్తలు ప్రసారం చేసినా, ప్రచురించినా, వదంతులు వ్యాపింపజేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ముందుగా నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారమే 10, 12 పరీక్షలు ఈ ఏడాది ఫిబ్రవరి 15న ప్రారంభమై ఏప్రిల్ 2 వరకు జరుగుతాయని తెలిపింది. అలాగే యూట్యూబ్, ఫేస్‌బుక్, టెలిగ్రామ్ లాంటి సామాజిక మాధ్యమాల ద్వారా తప్పుడు వార్తలు వ్యాపింపజేసినా కఠిన చర్యలు తప్పవని పేర్కొంది.